క్లుప్తంగా...

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేటలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం శామీర్‌పేట గ్రామసభలో మాట్లాడుతూ... గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామపెద్దలు, పాలకులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యెల్ల బాయి, జెడ్పీటీసీ అనిత, స్థానిక సర్పంచ్ బాలమణి, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కావేరి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్‌తో కలిసి ఇంటింటికి తిరిగి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రాధా, మల్లేష్, వీరేశ్, కార్యదర్శి సునిత, మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కీసర: కీసర గ్రామానికి చెందిన వినోద్‌చౌదరి జయంతిని పురస్కరించుకుని సోమవారం కీసరలోని ఆనాథాశ్రమంలో ఉంటున్న వృద్ధులు, మహిళలకు వినోద్‌చౌదరి కుటుంబసభ్యులు, మిత్రులు కలిసి దుస్తులను పంపిణీ చేయడంతో పాటు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వినోద్‌చౌదరి తండ్రి మోహన్‌లాల్‌చౌదరి మాట్లాడుతూ తమ కుమారుడు వినోద్‌చౌదరి జ్ఞాపకార్థం ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చందుచౌదరి, జుమస్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా, మిత్రులు తుడుం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

శామీర్‌పేట్: ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామంలోని పల్లె దవాఖానాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య పరిరక్షణపై ప్రజలను చైతన్యం చేయాలని, ప్రాథమిక ఆరోగ్య సేవలను విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు.

కనీస వేతనాలు చెల్లించాలి

మిషన్ భగీరథ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

మేడ్చల్: తమకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులు స్థానిక మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కలిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

వేడుకలకు వేళాయె..

- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు
- జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్న మంత్రి మల్లారెడ్డి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం మూడు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైంది. వేడుకల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ మైదానంలో ఉదయం 11 గంటలకు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం ఉదయం 11.05 గంటలకు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. ఉదయం 11.10 గంటలకు మంత్రి మల్లారెడ్డి జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో స్వాతంత్య్ర సమరయోధులు, జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ,స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు , సైబరాబాద్ పోలీస్ కమిషనర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పుర ప్రముఖులు పాల్గొంటారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ అధికారులు, సిబ్బందికి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేశారు. వర్షం పడినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ప్రూఫ్ షామియానాలు వేశారు. వేదికను రంగురంగుల పూలతో అలంకరించారు. కలెక్టరేట్ ముఖ ద్వారం నుంచి మైదానం వరకు విద్యుత్ లైట్లతోపాటు రంగురంగుల పూలను అమర్చారు. కూడళ్ల వద్ద



విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ మైదానంలో పోలీసులు కవాతు నిర్వహించగా, కలెక్టర్ అమయ్‌కుమార్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సత్వరమే స్పందించాలి



108, 102 వివరాలు తెలుసుకుంటున్న ప్రోగ్రాం మేనేజర్ వసంత్ పాపయ్య

శామీర్‌పేట్: ఆపదలో ఉన్న వారి ఫోన్‌కాల్‌కు స్పందించి, వైద్య సేవలు అందించాలని జీవీకే ఈఎంఆర్‌ఐ ప్రోగ్రాం మేనేజర్ వసంత్ పాపయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జీవీకే ఈఎంఆర్‌ఐ ఆధ్వర్యంలో శామీర్‌పేట కేంద్రంగా నడుస్తున్న 108, 102 వాహనాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల్లోని రికార్డులు, మెడికల్ ఎక్విప్‌మెంట్‌లను పరిశీలించారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ సతీష్, ఈఎంటీ మల్లేష్, పైలట్‌లు కరుణాకర్, మహేందర్ పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ దేవరాజు

మేడ్చల్: రాఘవేంద్ర కాలనీలోని ఎస్టీ హాస్టల్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని 3వ వార్డు కౌన్సిలర్ జాకట దేవరాజు ఆర్టీసీ డీఎంను కోరారు. కాలనీ వాసులతో కలిసి ఆయన సోమవారం డీపో ఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. హాస్టల్ విద్యార్థులు, రాఘవేంద్రనగర్, బాలాజీనగర్ తదితర కాలనీ వాసులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకుని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

ఫౌంటేన్ పనులు నిలిపి వేయండి

మేడ్చల్: స్థానిక ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలోని అంబేడ్కర్ భవనం ఎదుట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వాటర్ ఫౌంటేన్ పనులను వెంటనే నిలిపివేయాలని కాలనీ వాసులు మున్సిపల్ డీఈ విజయలక్ష్మీ , తహసీల్దార్ శైలజ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ భవనం ఎదుట ఫౌంటేన్ ఏర్పాటు చేయడంతో రోడ్డు ఇరుగ్గా మారుతుందని, అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలు కనబడవన్నారు. ఈ నేపథ్యంలో పనులను నిలిపివేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజా సమస్యల పరిష్కారం

జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ముందుకెళ్లాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లా ఆఫీసర్ చంద్రావతి ,జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, ఎస్‌డీసీ (ఇండస్ట్రీస్) సైదులుతో కలిసి ప్రజల నుంచి 84 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి



జవహర్‌నగర్: దేశ ప్రజలకు జాతీయ జెండాపై అభిమానం గుండెల నిండా ఉంటుందని, స్వాతంత్య్ర స్ఫూర్తిని భావితరాలకు అందించాలని మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మల్కారంలో సీఆర్‌పీఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ సమక్షంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్, హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు.

తాగు నీటి కోసం ధర్నా

కీసర: కీసరలోని శివాజీనగర్ కాలనీకి గత 20 రోజులుగా మంచినీటి సరఫరా కావడం లేదని సోమవారం సాయంత్రం కాలనీవాసులు కీసర–శామీర్‌పేట రహదారిపై ఖాళీ డ్రమ్ములు పెట్టి ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 రోజులుగా తమ కాలనీలో మంచినీటి సరఫరా కావడం లేదన్నారు. దీనిపై పంచాయతీ అధికారులను నిలదీయగా శామీర్‌పేట చెరువు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయినందున నీటిని విడుదల చేయడం లేదని తెలిపారన్నారు. ట్యాంకర్ల ద్వారానైనా కాలనీకి నీటి సరఫరా చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని సర్పంచ్ మాధురి, అధికారులు పేర్కొన్నారు.

రూ.20.63 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: కౌన్సిల్ తీర్మానం మేరకు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో రూ. 20.63 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, అంతర్గత రోడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, అనురాధా, నస్రీన్ సుల్తానా, నాగజ్యోతి, హేమలత, శశికళ, వసంత, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మల్లేష్, జహంగీర్, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, పద్మారావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు సురేందర్‌రెడ్డి, బి అరుణ, షౌకత్, పి అరుణ, ఏఈ నరేశ్, మేనేజర్ అంజిరెడ్డి, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పక్కన ఫ్లెక్సీలను తొలగించాలి

మేడ్చల్: రాజకీయ పార్టీల నాయకులు, ఇతరులు మేడ్చల్ నుంచి అత్వెల్లి వైపు వెళ్లే 44వ జాతీయ రహదారి ఇరుపక్కల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలని పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం మన్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్‌ను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందించిన పాలకులు అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. జాతీయ ఇరువైపుల రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని తొలగించాలన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డాక్టర్ భద్రారెడ్డి

కీసర: మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో తమ సొంత నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి మల్లారెడ్డి తనయుడు, సీఎంఆర్‌హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి అన్నారు. సోమవారం చీర్యాల గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం, తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీకాలనీ, ముత్యాలమ్మగుడికి రూ 2 లక్షలు, కాటమయ్యగుడి నిర్మాణానికి రూ లక్ష విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, నాయకులు పులగుర్ల శ్రీనివాస్, తుంగ ధర్మేందర్, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొంగ రశీదులపై చర్యలు తీసుకోండి

ఘట్‌కేసర్: ఎదులాబాద్ పంచాయతీలో జరిగిన అవకతవకలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సభ్యులు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా సర్పంచ్ సురేశ్, బిల్ కలెక్టర్‌పై గతంలో రెండు సార్లు ఫిర్యాదు చేశామని లేఖలో పేర్కొన్నారు. ఇంటి పన్ను చెల్లించాలని వార్డు సభ్యులు కోరగా ఎవరూ చెల్లించడం లేదని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుని గ్రామాభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, వార్డు సభ్యులు ఆంజనేయులు, గణేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఘట్‌కేసర్: హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన లైంగికదాడి ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ లైంగిక దాడికి పాల్పడిన హరికృష్ణ, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు అత్యంత సన్నిహితుడైనందున ప్రభుత్వం కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని గురుకులాల్లో అవినీతి రాజ్యమేలుతోందని, దీంతో వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. సంఘటనపై సీబీఐతో విచారణ జరిపించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్య్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: దేశ స్వాతంత్య్రం కోసం జరిగిన పోరాటంలో అమరైన వీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని మేడ్చల్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆజాదీకా అమృత్ మహోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. వారందరికీ నివాళులు అర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్, కౌన్సిలర్ సరస్వతి, నాయకులు రవిందర్‌గౌడ్, మహేశ్, కావేరి శ్రీధర్, వెంకట్, నానిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సైదోనిగడ్డ తండాలో ఘనంగా తీజ్ వేడుకలు



మేడ్చల్‌రూరల్: మండల పరిధిలోని సైదోనిగడ్డ తండాలో సోమవారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏటా గిరిజనులు సంప్రదాయబద్ధంగా తీజ్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. పాడిపంటలు బాగా పండాలని 9 రోజుల పాటు నవధాన్యాలను వెదురుబుట్టలో ఉంచి భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. విత్తులు మొలకెత్తిన 9వ రోజున వాటిని సాంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జన చేస్తారు. మహిళలు వెదురుబుట్టలను నెత్తిన పెట్టుకుని గిరిజన పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఘనంగా తీజ్ సంబరాలు జరుపుకున్నారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్, నాయకులు రాజేందర్, నాగేశ్వర్‌రావు, గిరిజనులు పాల్గొన్నారు.

అమితాబ్ ఆదరణ విద్యాలయానికి బస్సు విరాళం



బస్సును ప్రారంభిస్తున్న ఆంజనేయులు గౌడ్ తదితరులు

కీసర: అమితాబ్ ఆదరణ విద్యాలయానికి చెందిన విద్యార్థుల సౌకర్యార్థం రూ.25 లక్షల విలువైన బస్సును ఎల్‌ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ జోనల్ మేనేజర్ ఎల్.కె. శ్యాంసుందర్ , రాజాసింగ్ అందజేయడం అభినందనీయమని నాగారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ సీనియర్‌నేత గూడూరు ఆంజనేయులుగౌడ్ అన్నారు. సోమవారం సరూర్‌నగర్‌లోని అమితాబ్ ఆదరణ విద్యాలయం వద్ద బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదరణ ఫౌండేషన్ డైరెక్టర్ మాధవరావు, ఫౌండేషన్ మెంబర్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వెళ్లేందుకు బస్సు అందజేసినందుకు ఎల్‌ఐసీ గోల్డెన్ జూబ్లీఫౌండేషన్ జోనల్ మేనేజర్ ఎల్. కె. శ్యాంసుందర్, రాజాసింగ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు చొరవ తీసుకున్న ఆంజనేయులు గౌడ్, గుండు మధుగౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గుండు మధుగౌడ్, మండలి శ్రీనివాస్‌రావు, రాంప్రసాద్, విఆర్‌జంపన్న, రామ్మోహన్, పాపానాయక్, శ్రీశైలం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ ట్యాంకర్ ఢీ కొని పెయింటర్ మృతి

పోచారం: డీజిల్ ట్యాంకర్ ఢీ కొనడంతో పెయింటర్ మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోడుప్పల్‌కు చెందిన దశరథ్ (52) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకుని వస్తున్న అతను అన్నోజిగూడలో వరంగల్ జాతీయ రహదారి దాటుతుండగా ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో దశరథ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య కంజర్ల అనసూయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.